క్లుప్తంగా

ఆలోచింపజేసిన ప్రదర్శనలు



విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవో దివాకరరావు

పరవాడ: స్థానిక బాలికల జెడ్పీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని సైన్స్, గణిత విజ్ఞానంపై పలు నమూనాలు ప్రదర్శించారు. ఈ విజ్ఞాన ప్రదర్శనను మండల విద్యాశాఖాధికారులు దివాకరరావు, సాయి శైలజ తిలకించి విద్యార్థులను అభినందించారు. వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలకు ప్రథమ బహుమతి, గ్రూపు బి, విభాగంలో ధర్మారాయుడుపేట జెడ్పీ పాఠశాలకు ప్రథమ బహుమతులు దక్కాయి. ఉపాధ్యాయుల విభాగం నుంచి పరవాడ బాలికల జెడ్పీ పాఠశాలకు బహుమతి లభించింది. కార్యక్రమంలో సైన్సు, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్నకు విశేషంగా అభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న రామానుజమ్

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామికి విశేషంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ, ఆరాధన కార్యక్రమాల అనంతరం స్వామికి అభిషేకం చేశారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ పూజలు నిర్వహించారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న వాలీబాల్ అసోషియేషన్ కార్యదర్శి భూషణరావు

సబ్బవరం: స్థానిక ప్రతిభ విద్యాలయంలో జిల్లా స్థాయి ప్రతిభ కప్ వాలీబాల్ పోటీలను ఉమ్మడి విశాఖ జిల్లా వాలీబాల్ అసోషియేషన్ కార్యదర్శి భూషణరావు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 8 టీమ్‌లు పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ ఆర్థిక సాయంతో మొదటి స్థానంలో నిలిచిన జట్టుకు కప్ తో పాటు రూ.20 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు నగదు ముగింపు రోజు శనివారం అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, ప్రిన్సిపాల్ హన్ని జోసెఫ్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కళాసేవ గొప్పది



బెహరా భాస్కరరావును సత్కరిస్తున్న గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు

- జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: కళాకారులను గుర్తించి వారికి సేవ చేయడం గొప్పవిషయం అని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. గోపాలపట్నం పౌర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన గోపాలపట్నం కళాసేవా పీఠం 8వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. కళాసేవా పీఠం చేస్తున్న కార్యకలాపాలు కళాకారులకు ప్రోత్సాహంగా నిలుస్తున్నాయన్నారు. కళాసేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు, అధ్యక్షుడు గొరకల రామదాసు, మాజీ అధ్యక్షుడు చందు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి జి. సింహాచలం తదితరులు భాస్కరరావును సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కోశాధికారి భాస్కర్ పాణిగ్రాహి, గ్రంథాలయ అధికారి నరసింహారావు పాల్గొన్నారు.

మండలంలోని రైతు భరోసా కేంద్రాలు - 17	ఒక్కో రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి రూ.21.80 లక్షలు	రైతులు 7 వేల మంది	సాగు విస్తీర్ణం 8,320 ఎకరాలు	వరిసాగు విస్తీర్ణం 3,320 ఎకరాలు	వ్యవసాయ, ఉద్యాన సహాయకులు 10 మంది

అన్నదాతకు భరోసా



గొటివాడలో అందుబాటులోకి వచ్చిన రైతు భరోసా కేంద్రం

నాడు

వ్యవసాయం దండగ.. కరెంట్ తీగలపై బట్టలు ఆరబెట్టుకోండి. ఇవి అన్నదాతలను కించ పరుస్తూ నాటి ముఖ్యమంత్రి, నేటి టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యలు. ఎరువులు, విత్తనాలు కావాలంటే మండల కేంద్రాలకు పరుగులు పెట్టాల్సిందే..



నేడు

ప్రజా సంకల్పయాత్ర ద్వారా రైతుల కష్టాలు కళ్లారా చూసిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే అండగా నిలుస్తానని మాట ఇచ్చారు. ఆ ప్రకారం రైతు భరోసాతో ఆదుకున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి దన్నుగా నిలిచాడు. ఉచిత పంటల బీమా పెట్టి రైతులకు భరోసా కల్పించారు.

- రైతు భరోసా కేంద్రాలతో చేరువైన సేవలు
- గ్రామల్లోనే ఎరువులు, విత్తనాలు
- రైతులకు తప్పిన పాట్లు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



వరి నూర్పిడి యంత్రాన్ని మల్లునాయుడుపాలెం రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్(ఫైల్)

సబ్బవరం: అన్నం పెట్టే రైతన్నకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నారు. వ్యవసాయ పనిముట్లు, ఇతర పరికరాలను రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు.

సేవలన్నీ రైతు చెంతకే..

సీజన్‌లో పంట వేసేందుకు పెట్టుబడి సాయం మొదలుకుని పంట చేతికందిన తర్వాత గిట్టుబాటు ధర అందించే వరకు అన్నదాతను వెన్నంటి ప్రోత్సహిస్తోంది. పంట బీమా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుంది. వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్డు ట్యాక్స్ రద్దు చేసింది. వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు ఉచితంగా విద్యుత్తు ఇస్తోంది.

17 కేంద్రాల ఏర్పాటు

మండలంలో 17 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో తొమ్మిది కేంద్రాలు పూర్తి చేశారు. అమృతపురం,మల్లునాయుడుపాలెం, గుల్లేపల్లి, అంతకాపల్లి ,పైడివాడ అగ్రహారం, గొల్లలపాలెం ,నారపాడు ,గొటివాడ, వంగలి గ్రామాల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు.

తుది దశలో ఉన్నవి

మరో 8 ఆర్‌బీకేల నిర్మాణం తుదిదశకు చేరింది. బంగారమ్మపాలెం, ఆసకపల్లి, సబ్బవరం,బాటజంగాలపాలెం,ఆరిపాక,తవ్వవానిపాలెం బోదువలస, మొగలిపురం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల నిర్మాణం చురుగ్గా సాగుతోంది.

అందుబాటులోకి కియోస్క్‌లు

మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ మిషన్‌లు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మిషన్ ద్వారా సాధారణ రైతు కూడా అతనికి కావాల్సిన ఎరువులు, విత్తనాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.

ఈ క్రాప్ నమోదు

వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులు వేసుకుంటున్న పంటలకు ఈ క్రాప్ చేస్తున్నారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టం కలిగితే రైతులను ఆదుకునేందుకు ఉచిత పంటల బీమా అమల్లోకి తెచ్చింది. రైతు భరోసా కేంద్రాలకు రైతులకు అనుసంధానకర్తలుగా పనిచేస్తున్న వ్యవసాయ,ఉద్యాన సహాయకుల ద్వారా ఈ పంటల నమోదు కార్యక్రమాన్ని నిరంతరాయంగా ప్రభుత్వం చేపడుతుంది.

యాంత్రీకరణ

రైతులను యాంత్రీకరణ వైపు ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రూ.15 లక్షల విలువ చేసే యంత్ర పరికరాలను 40 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తోంది. ట్రాక్టర్‌తో పాటు మిగిలిన వ్యవసాయ పరికరాలు అందించడం ద్వారా గ్రూపులోని రైతులతో పాటు రైతు భరోసా కేంద్రం పరిధిలోని మొత్తం రైతులు అద్దె ప్రాతిపదికన సద్వినియోగం చేసుకోవచ్చు.

అన్నదాతకు దన్ను



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలవాలనే ఉద్దేశంతో పండించిన పంటలకు మద్దతు ధర నిర్ణయించి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుంది. వరి పంటకు ఈ సంవత్సరం మద్దతు ధర పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అన్నదాతలకు వరం కానుంది. రాయితీపై పరికరాలు కూడా అందిస్తోంది.

–పోతల సత్యనారాయణ,మండల వ్యవసాయ అధికారి,సబ్బవరం

రైతు భరోసాతో పెట్టుబడికి ఊతం



ప్రస్తుతం వ్యవసాయం అంత సులభం కాదు. ప్రతీ దశలో పెట్టుబడి లేనిదే పని జరగదు. తొలకరి, ఖరీఫ్ నాటికి సగటున రూ.20 వేలు అవసరం అవుతాయి. ఖరీఫ్ సీజన్‌కు ముందు చేతిలో చిల్లిగవ్వ ఉండని పరిస్థితి. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పెట్టుబడి సాయం అందిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సాగుకు సంబంధించిన సేవలు అందుతున్నాయి.

– పిల్లల అప్పలనాయుడు, రైతు

అందుబాటులో విత్తనాలు, ఎరువులు



వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే పెట్టుబడి సాయం కింద నాలుగేళ్లుగా రైతు భరోసా అందుకుంటున్నాం. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నివిధాల ఆదుకుంటున్నారు. గతంలో ఎరువులు, విత్తనాల కోసం మండల కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు ఆ కష్టాలు తొలగిపోయాయి. గ్రామంలోనే కావాల్సిన విత్తనాలు, ఎరువులు లభిస్తున్నాయి. పంటలు కూడా కొనుగోలు చేస్తున్నారు.

–స్వామినాయుడు, రైతు

కొనసాగుతున్న పగల్‌పత్తు ఉత్సవాలు



తిరువీధిలో అప్పన్న ఉత్సవమూర్తులు



పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు మూడోరోజు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన అయ్యావారి సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వామివారి నామస్మరణలో మునిగితేలారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీలో అదిష్ఠింపజేశారు. ఆలయ బేడామండపంలో విశేషంగా తిరువీధి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆస్థానమండపంలో అదిష్ఠింపజేసి దివ్యప్రబంధ పారాయణాలు పఠించారు.

సైనిక లాంఛనాలతో సీఐఎస్‌ఎఫ్ జవాను అంత్యక్రియలు



మధు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సైనికులు

గోపాలపట్నం: సీఐఎస్‌ఎఫ్ జవానుకు సైనిక లాంఛనలతో శుక్రవారం యల్లపువానిపాలెంలో అంత్యక్రియలు నిర్వహించారు. యల్లపువానిపాలేనికి చెందిన పెట్ల మధు(40) సీఐఎస్‌ఎఫ్ జవానుగా పని చేస్తున్నారు. ఇటీవల రాజస్థాన్ ఎన్నికల విధులకు హాజరయ్యారు. అక్కడ ఈ నెల 13న గుండె పోటుతో మృతి చెందడంతో ఆయన భౌతిక కాయాన్ని యల్లపువానిపాలెం తీసుకు వచ్చారు. ఇక్కడ జవానుల అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక లలితా పారాయణ



సామూహిక లలితా పారాయణలో మహిళలు



గాయత్రీదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెందుర్తి: చినముషిడివాడ దరి శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీ ఆలయంలో శుక్రవారం సామూహిక శ్రీ లలితా పారాయణ ఘనంగా జరిగింది. నగరంలోని కంచరపాలేనికి చెందిన హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో సుమారు వంద మంది పారాయణ చేశారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు జరిగిన కార్యక్రమంలో కాలనీ నివాసితులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవారికి పంచామృతాభిషేకం విశేషంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రసాదం అందజేసింది. ఆలయ ధర్మకర్త సరస్వతుల నరసింహమూర్తి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న కాప్‌-28 మాక్ కాన్ఫరెన్స్



కేజీబీవీ విద్యార్థులను అభినందిస్తున్న జేసీ విశ్వనాథన్

- అభినందించిన జేసీ కె.ఎస్.విశ్వనాథన్

పెందుర్తి: జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రంలో నిర్వహించిన కాప్-28(కాన్ఫరెన్స్ ఆఫ్ ది పార్టీస్) మాక్ కాన్ఫరెన్స్ ఉత్సాహంగా సాగింది. 28 దేశాల ప్రతినిధులుగా కేజీబీవీ విద్యార్థినులు వ్యవహరించారు. ఆయా దేశాల ప్రజల వేషధారణతో పాటు జెండాలతో కాప్-28 ఆంగ్లం, హిందీ భాషల్లో ప్రసంగించి ప్రతిభ చాటారు. అభివృద్ధి చెందిన దేశాలు, సంపన్న దేశాలు క్లైమేట్ ఫండ్ ఇచ్చి దక్షిణార్ధ గోళంలో ఉన్న దీవుల రక్షణ తదితర అంశాలపై చర్చించారు. ప్రపంచలో ఉన్న పునరుద్పాదక ఇంధన శక్తి 2030 నాటికి మూడు రెట్లు పెరగాలని.... చమురు, గ్యాస్, బొగ్గు వినియోగాన్ని తగ్గించాలనే వాదనను ఆయాదేశాల ప్రతినిధులుగా విద్యార్థినులు బలంగా వినిపించి అందరినీ ఆకట్టుకున్నారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, తద్వారా ఆరోగ్యంపై కలిగే ప్రభావాలు, వాతావరణ నమూనాలను మార్చడం, వాతావరణ సంబంధిత పేదరికం, ఆహార భద్రత, నీటి కొరత తదితర విషయాలపై లోతుగా చర్చించారు. కాన్ఫరెన్స్ అనంతరం డీఈవో చంద్రకళ, ఏపీసీ శ్రీనివాస్, ఆనందపురం కేజీబీవీ ప్రిన్సిపాల్ చంద్రకళ, భీమిలి కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగ, పద్మనాభం కేజీబీవీ ప్రిన్సిపాల్ లిల్లీ గ్రేస్ తదితరులు జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథంను కలిశారు. ఈసందర్భంగా జేసీ కొంత సేపు విద్యార్థినులతో మట్లాడి వారి ప్రతిభను ప్రశంసించారు. విద్యార్థినులకు ప్రోత్సాహం అందించాలని పేర్కొన్నారు. సామాజిక వర్తమాన విషయాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు.



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విద్యార్థులు

31న రెడ్డి కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం

సీతమ్మధార: వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ ఆదివారం ముడసర్లోవ రోజ్ గార్డెన్స్‌లో రెడ్డి కుటుంబాల ఆత్మీయ సమ్మేళన వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పలు కార్యక్రమాలు, పిల్లలు, మహిళలకు ఆటలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ షో, తంబులా, ప్రతిభ గల విద్యార్థులకు అతిథులచే స్కాలర్‌షిప్, పోటీల విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు. వివరాలకు 90306 55681 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎన్‌ఎస్‌టీఎల్‌లో ముగిసిన స్వచత పక్వాడా

గోపాలపట్నం:ఎన్ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛత పక్వాడా పక్షోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 1న ప్రారంభమైన కార్యక్రమాల్లో ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబసభ్యులు, మహిళా కల్యాణ మంచ్ సభ్యులు, రామ్‌నాథ్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శుక్రవారం జరిగిన ముంగిపు కార్యక్రమంలో మెయిన్ గేటు వద్ద మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎన్ఎస్‌టీఎల్‌లో ర్యాలీ నిర్వహించారు. నరవ జిల్లా పరిషత్ పాఠశాలలో పరిశుభ్రత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పెందుర్తి లయోలా ఓల్డేజీ హోమ్‌లో హైజనిక్ మెటీరియల్స్ వితరణ చేశారు. పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌వీ సత్యశ్రీనివాస్, అశోక్ కుమార్, రాహుల్ దీక్షిత్, ఉద్యోగులు పాల్గొన్నారు.



పెందుర్తి లయోలా ఓల్డేజ్ హోమ్‌కు మెటీరియల్ అందిస్తున్న ఎన్ఎస్టీఎల్ ఉద్యోగులు

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



క్షీరాభిషేక సేవలో సిరుల తల్లి

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల రెండో రోజు శుక్రవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన అనంతరం 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనాలు కల్పించారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం అనంతరం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనాలు కల్పించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకాలు, అష్టోత్తర నామార్చన నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

క్షీరాభిషేక సేవ

ప్రతి శుక్రవారం ఉదయం 8 గంటలకు నిర్వహించే క్షీరాభిషేక సేవలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

మండపంలో వైదిక కార్యక్రమాలు

మండపంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీచక్రనవావరణార్చన, లక్ష్మీహోమం, మార్గశిర మాస విశేష కుంకుమార్చన, అష్టోత్తర కుంకుమార్చన, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహా విద్యాపారాయణ నిర్వహించారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మార్గశిర మాస విశేష కుంకుమార్చనలు జరిపారు. మధ్యాహ్నం 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కవి సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

బీచ్‌రోడ్డు: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో శని, ఆదివారాల్లో జరగబోయే కవి సమ్మేళనం పోస్టర్‌ను సాహితీవేత్త డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాష కోసం శ్రీశ్రీ కళావేదిక చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళా వేదిక విశాఖ జిల్లా అధ్యక్షుడు సత్తివాడ శ్రీకాంత్, బాబయ్య, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తోనే సాధ్యమవుతుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని సబ్బవరం-1 సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..,పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా మహిళాసాధికారిత,అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పలు విధానాలు దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. నవరత్నాలతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అంతా వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంక్షేమ పథకాల బోర్డును ఆమె ఆవిష్కరించారు. పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, నియోజకవర్గ ప్రతినిధి కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు,ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,బైలపూడి దేముడు,యర్రంశెట్టి రాము,దనిమిరెడ్డి శ్రీనివాసరావు,పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు బంతికోళ్ల పద్మ,ఈవోఆర్‌డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేవీల్లో ఘనంగా వార్షిక క్రీడా దినోత్సవం

సింథియా: సింథియా దరి నౌసేనాబాగ్‌లోని కేంద్రీయ విద్యాలయం (కేవీ-1)లో 41వ వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ కె.బాబూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఐఎన్ఎస్ సర్కార్ సీఏవో కమాండర్ రాజశేఖర్, నామిని చైర్మన్ మీనాకుమారి, లెఫ్టినెంట్ కమాండర్ కౌశిక్, కేవీ-2 ప్రిన్సిపాల్ కె.సూర్యప్రకాశరావు జ్యోతి ప్రజల్వన చేసి పోటీలను ప్రారంభించారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులు మెడల్స్, సరిఫికెట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో..

మల్కాపురంలోని కేంద్రీయ విద్యాలయంలో 57వ వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాలయ కమిటీ చైర్మన్, కమాండెర్ ఫెర్నాండెజ్, లెఫ్టినెంట్ కమాండర్ హర్షిత జ్యోతి ప్రజల్వన చేసి వేడుకలను ప్రారంభించారు. 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నృత్య, నాటికలను ప్రదర్శించారు.